క్లుప్తంగా

డెంగీ వ్యతిరేక మహోత్సవం



గోడిలంకలో ర్యాలీ చేస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భరతలక్ష్మి తదితరులు

అల్లవరం: మండలంలోని గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ భరతలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31 వరకూ డెంగీ వ్యతిరేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేసి మొగళ్లమూరు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్పందన, యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలి



ఎస్పీ రాజశేఖరన్‌ను సత్కరించిన నూతనంగా ఎంపికైన హోంగార్డులు

యానాం: పోలీస్ శాఖలో ఉద్యోగం లభించడం అదృష్టమని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ రాజశేఖరన్ నూతనంగా ఎంపికైన హోంగార్డులకు ఉద్బోధించారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఇటీవల పుదుచ్చేరి పోలీస్‌శాఖలో నూతనంగా ఎంపికైన 26 మంది హోంగార్డులు ఎస్పీ రాజశేఖరన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజశేఖరన్ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడటంతో పాటు పోలీస్‌శాఖకు సంబంధించిన నూతన చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్‌ఐలు మురుగానందన్, శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళులు

యానాం: జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీరోడ్డులోని పింగళి వెంకయ్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ఎస్‌ఐ మురుగానందన్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమస్యలపై పరిశీలన

కాట్రేనికోన: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం కాట్రేనికోన విచ్చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు, ప్రస్తుతం విద్యారంగంలో చేయవలసిన మార్పులపై ఉపాధ్యాయుల సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి, చిక్కం మైనర్ బాబు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి సహకరించాలి

యానాం: భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నియోజకవర్గ ప్రజల తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి సహకరించాలని సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విజ్ఞప్తి చేశారు. గురువారం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ వ్యవస్థ ద్వారా యానాంకు సక్రమంగా నీరు అందేలా చూడాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్యనారాయణ

అమలాపురం రూరల్: మండలంలో కామనగురువు 216 జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిమ్స్ ఆసుపత్రి సమీపంలో అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో భట్నవిల్లి గ్రామానికి చెందిన తొత్తరమూడి బుల్లి సత్యనారాయణ(53) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై అమలాపురం తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

‘ఫిస్టియా’ కలుపు.. పంటకు ముప్పు..

- బురద మట్టిలో వేగంగా విస్తరిస్తున్న ఫిస్టియా
- పొలంలోని పోషకాలు మొక్కకు అందనివ్వదు
- ముందస్తు చర్యలు తీసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు



ఫిస్టియా కలుపు



ఐ.పోలవరంలో పొలాన్ని చదును చేస్తున్న కూలీలు

ఐ.పోలవరం: తీర ప్రాంత మండలాల్లో వరి సాగుకు ‘ఫిస్టియా’ కలుపు ప్రధాన అవరోధంగా మారుతోంది. బురద మట్టితో కూడిన నేలలు కావడంతో పువ్వు రకానికి చెందిన ఫిస్టియా(అంతర తామర కలుపు) వేగంగా విస్తరిస్తోంది. పంట కాలువలు, బోదెలు, పంట చేలల్లో పెద్ద ఎత్తున ఫిస్టియా కలుపు వచ్చి చేరుతోంది. దీనిని తొలగించడం రైతులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారంగా మారిపోతోంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో ఈ సమస్య అధికంగా ఉంది. అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరి ఆయకట్టు ఉంది. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు, కాట్రేనికోన మండలాల్లో సుమారు 34 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. ఇక్కడ ముంపునకు తోడు ఫిస్టియా కలుపు కూడా ప్రధాన సమస్య. తీరంలోని అన్ని మండలాల్లోనూ ఈ కలుపు అధికంగా వస్తోంది.

సాగుకు ప్రధాన అవరోధం

వరి సాగులో వచ్చే మిగిలిన కలుపులతో పోల్చుకుంటే ఫిస్టియా కలుపు రైతులను అధికంగా నష్టపరుస్తోంది. ఈ కలుపు పువ్వు ఆకారంలో ఉండి నీటిపై తేలుతోంది. సాగు ఆరంభంలో దమ్ములు చేసి నీరు పెట్టిన వెంటనే ఇది పంట బోదెలు, కాలువల ద్వారా చేలల్లో చేరి పెరిగిపోతోంది. వరి మొక్కల మధ్య ఉండే స్థలంలో ఈ పువ్వు అల్లుకుపోతోంది. ఇది వచ్చిన తరువాత ఎరువులు జల్లితే వాటిలోని మూడొంతుల పోషకాలు, ఖనిజాలు, లవణాలు ఇవే పీల్చుకుంటున్నాయి. పురుగు మందుల ప్రభావాన్ని కూడా ఇది నియంత్రిస్తోంది. దీని వల్ల వరి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. మిగిలిన కలుపు తొలగించినట్టుగా ఇది కూలీలను పెట్టి తొలగించాలని రైతులకు ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ ఖర్చవుతోందని వాపోతున్నారు.

ముందుగానే అడ్డుకోవాలి

- పంట బోదెల ద్వారా నీరు పెడుతున్న సమయంలోనే ఫిస్టియా పువ్వు రాకుండా రైతులు చూసుకోవాలి. చేలల్లోకి నీరు వచ్చే తూరల వద్ద అతి సూక్ష్మ రంధ్రాలు ఉన్న నెట్‌లు(వలలు) ఏర్పాటు చేసుకుని పువ్వు రాకుండా చూసుకోవచ్చు.
- తూరల వద్ద వలలు ఏర్పాటు చేయకుండా ఉంటే కొబ్బరి ఆకు చివరి భాగం నీరు వచ్చే దారిలో అడ్డుగా పెట్టాలి. ఇలా చేయడం వల్ల ఆకులకు తగిలి ఫిస్టియా పువ్వు నిలిచిపోతోంది.
- దమ్ములు చేసి నారుమడులు, నాట్లు వేసేటప్పుడు, పొలాన్ని చదును చేస్తున్న సమయంలో ఫిస్టియా పువ్వు కనిపిస్తే దానిని భూమిలోకి తొక్కివేయాలి. ఇలా చేయడం వల్ల ఫిస్టియా పువ్వు భూమిలో కుళ్లి సేంద్రియ కర్బనంగా మారి భూమికి మేలు చేస్తోంది.

ఫిస్టియా పువ్వును నివారించాలి



పంట చేలల్లోకి ఫిస్టియా పువ్వు రాకుండా ముందుగానే నివారించాలి. ఒకవేళ చేలల్లోకి వస్తే ఒక ఎకరాకు 400 గ్రాముల 2, 4 – డీ సోడియం సాల్ట్ 80 శాతం డబ్ల్యూపీ లేదా 400 గ్రాముల 2, 4, – డీ అమైన్ సాల్ట్‌ను వాడాల్సి ఉంటుంది. లేదంటే 50 గ్రాముల ఇథాక్సిసల్ఫ్యూరాన్ 15 శాతం డబ్ల్యూడీజీ లేదా 8 గ్రాముల మెట్సల్ఫ్యూరాన్ మిథైల్‌ను క్లోరిమురూన్ ఇథైల్ 20 శాతం డబ్ల్యూపీ వాడాలి. లేదా 800 మి.లీటర్ల పెనాక్సులామ్, సైహాలోఫాస్ ఈథైల్‌ను కలిపి లేదా 500 మిల్లీ లీటర్ల ఫ్లోరా పైరాక్సిఫెస్ బెంజైల్ 1.25 శాతాన్ని పెనాక్సులామ్ 2 శాతం మందుల్లో ఏదో ఒక దానికి 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.

– ఎం.వాణి, మండల వ్యసాయ శాఖ అధికారి, ఐ.పోలవరం

ఫొటో ఎక్స్‌పోను జయప్రదం చేయాలి



ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

తాళ్లరేవు: కాకినాడలో వచ్చే నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పోను జయప్రదం చేయాలని ది ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు కోరారు. గురువారం మండల కేంద్రమైన తాళ్లరేవు లయన్స్‌క్లబ్ హాలులో సంఘ తాళ్లరేవు మండల అధ్యక్షుడు సలాది ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చే నెల 3, 4 తేదీల్లో కాకినాడ తూరంగిలో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖద్రు, కోశాధికారి పేపకాయల బద్రి, జిల్లా సభ్యుడు కుక్కల సతీష్‌కుమార్, మండల కార్యదర్శి నాగిడి రామాంజనేయులు, కోశాధికారి తొగరు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పితాని అనిల్, సంయుక్త కార్యదర్శి పితాని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా నూతన కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆర్.మహేష్ కుమార్‌ను ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక కలెక్టరేట్‌లో కొత్త కలెక్టర్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కట్టోజు సన్నయ్య దాసు, కుప్పాల రామకృష్ణ, యర్రా సతీష్, దండుమేను రూపేష్, అడపా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

అమలాపురం రూరల్: నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రావిలాల మహేష్‌కుమార్‌ను గురువారం రాత్రి జిల్లా ఎస్పీ శ్రీధర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులకు ప్రయోజనం కలిగే పనులు చేయండి



అధికారులతో సమీక్ష జరుపుతున్న ఆనందరావు

సాక్షి, అమలాపురం: నియోజకవర్గ పరిధిలో రైతులకు ప్రయోజనం కలిగించే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. క్యాంపు కార్యాలయంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయడం, కాలువల మరమ్మతు పనులు చేపట్టడంపై ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు



నడవపల్లిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కాట్రేనికోన: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.లిఖిత అన్నారు. మండలంలోని నడవపల్లి గ్రామంలో సర్పంచ్ దొమ్మేటి పల్లవి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నడవపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో పీహెచ్‌సీ వైద్యురాలు లిఖిత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్‌ఎస్ ద్రావణంతో ఉపశమనం అందించొచ్చని చెప్పారు. దోమలతో మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీహరి, ఆరోగ్య సిబ్బంది రేణుక, రమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికుల తొలగింపు అన్యాయం



ఫ్యాక్టరీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

యానాం: నియోజకవర్గ శివారు అడవిపొలంలో ఉన్న సెల్డాన్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న పలువురు మహిళా కార్మికులను విధుల నుంచి ఏకపక్షంగా తొలగించడం అన్యాయమని, తక్షణం వారిని విధుల్లో చేర్చుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ గురువారం డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులంతా కలిసి ఫ్యాక్టరీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలకు రోజుకు కేవలం రూ.200 వేతనం ఇస్తూ ఈఎస్ఐ, పీఎఫ్, మెటర్నటీ లీవు వర్తింపజేయడం లేదన్నారు. అదనపు గంటల పనికి వేతనం ఇవ్వాలని ప్రశ్నించినందుకు నలుగురు మహిళా కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం ముందస్తు నోటీసు ఇవ్వకుండా తొలగించడం సరికాదన్నారు. మహిళలను తిరిగి విధుల్లో చేర్చుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ కె.సత్యనారాయణ, సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, సలాది నాగబాబు పాల్గొన్నారు.

ఆక్రమణను తొలగించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్



ఉప్పలగుప్తంలో అనధికారికంగా నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉప్పలగుప్తం: మండల కేంద్రం ఉప్పలగుప్తంలో ఓ పంచాయతీ అధికారి ప్రభుత్వ భూమిని ఆక్రమించడంపై ‘రాత్రికి రాత్రే షెడ్డు పుట్టుకొచ్చింది’ శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పోలీసుల సహకారంతో పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, వీఆర్‌వో గనిశెట్టి వీరవేణిల ఆధ్వర్యంలో గురువారం రేకుల షెడ్డును తొలగించారు. ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తొలగించిన రేకుల షెడ్డు సామగ్రిని పంచాయతీ అధీనంలో భద్రపరిచామని మండల పరిషత్ సమావేశంలో ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కార్యదర్శి రామకృష్ణ వివరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక పట్టాభిరామస్వామి ఆలయ మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నాగ చైతన్య స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, పంచామృతాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అల్లూరికి ఘన నివాళులు



మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగేంద్రమణి తదితరులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గుండెపూడి గ్రామస్తులు

అమలాపురం టౌన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, మున్సిపల్ కౌన్సిలర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్నయ్యదాసు, బొర్రా వెంకటేశ్వరరావు, కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు జాన్సన్ బిల్లి, ఖ్వాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక భూపయ్య అగ్రహారంలోని రుద్రరాజు కాంప్లెక్స్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ‘ఆంధ్ర వీర విప్లవ కిశోరం మన్యం వీరుడు అల్లూరి’ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా ఆరోగ్య సేవా సంస్థ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ రుద్రరాజు సాయి శిల్ప, డాక్టర్ పవన్‌కుమార్, రుద్రరాజు ఉషాకుమారి, సినీ నటుడు గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక క్షత్రియ కళ్యాణ మండపం వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలుగువారి పౌరుష ప్రతీక అల్లూరి

యానాం: తెలుగు వారి పౌరుషానికి ప్రతీక అల్లూరి సీతారామరాజు అని పలువురు కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని సమాచారశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రీ రహదారిలోని అల్లూరి విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యానాం క్షత్రియ పరిషత్ నాయకులు దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వర్మ, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కోడూరుపాడులోని అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు. గుండెపూడిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి స్థానిక క్షత్రియ యువత ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

తాళ్లరేవు: స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న వివేకానంద విగ్రహానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్యరాజు బి.శ్రీనివాసరెడ్డి, కట్టా ఆదినారాయణ, నున్న దత్తు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జయంతి సందర్భంగా తాళ్లరేవు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు అత్తిలి బాబూరావు, నరేంద్ర రెడ్డి, సతీష్‌రాజు, సుందరపల్లి సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా రంగా జయంతి



విలసవిల్లిలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి, గొల్లవిల్లి, చల్లపల్లి గ్రామాల్లో వంగవీటి మోహనరంగా 77వ జయంతిని గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఉర్మిళ దేవి ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సుంకర బుజ్జి, అరిగెల నానాజీ, సలాది నాగరాజు, కోలా ఏసు, కర్రా చిన్న, గనిశెట్టి కిషోర్, ముత్యాల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా జయంతి వేడుకలు

అమలాపురం టౌన్: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా 74వ జయంతి వేడుకలు స్థానిక నల్ల వంతెన వద్ద రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. నల్ల వంతెన వద్ద గల వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వంటెద్దు బాబి, నల్లా అజయ్, యార్లగడ్డ రవీంద్ర, పేరి శర్మ, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్థానిక కల్వకొలను వీధిలోని రంగా విగ్రహానికి కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూతన చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పడాల సుబ్బారావు తదితరులు

యానాం: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం కలుగుతుందని అడ్వకేట్, బీఎస్ఎస్ రిసోర్స్‌పర్సన్ పడాల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన చట్టాలపై మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలోని మిషన్‌శక్తి సభ్యులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి తెలుసుకోవడం వల్ల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సహకరించవచ్చని, ముఖ్యంగా చట్టాలపై మహిళలు అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో మిషన్‌శక్తి జిల్లా కోఆర్డినేటర్ ఎ.రిప్కారోసిలిన్, సభ్యులు మహా, పుణ్య, తేజస్వి, సుధా, విజయ, ప్రిన్సిపల్ ఉమ, ఫిజికల్ డైరెక్టర్లు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహా సౌర యాగం పూర్తి



కేశనకుర్రుపాలెంలో సౌర యాగ ముగింపు పూజలు చేస్తున్న అర్చకులు



రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలెంలో వేంచేసిన రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీరుద్ర, శత చండీ, మహా సౌర యాగం గురువారం ఘనంగా ముగిసింది. గత 12 రోజులుగా కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, కాళ్లకూరి కామేశ్వర శర్మ, వెలవల్లి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో యాగం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం చివరిరోజు ఆలయంలో గణపతి ప్రార్థన, గవ్యాంతం, సూర్యనమస్కారాలు, మహా సౌర హోమం, మహాన్యాసం, నదీజలాభిషేకం, బిల్వార్చన, మహా పూర్ణాహుతి, అగ్ని ప్రదక్షిణ, శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి యాగాన్ని తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రతి నిత్యం అన్నప్రసాదాన్ని అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాట్రేనికోన: సబ్ స్టేషన్‌లోని 33/11 కేవీ పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కాట్రేనికోన టౌన్, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, కొప్పిగుంట, పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం డివిజన్ పరిధిలోని 132 పవర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కోనసీమలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈదరపల్లి, బాలయోగి ఘాట్, కామనగరువు, పేరూరు, బెండమూర్లంక, దేవగుప్తం, అంబాజీపేట, గంగాలకుర్రు, చల్లపల్లి, ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.